మేకలమండి ప్రభుత్వ పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు

బన్సీలాల్‌పేట్: భోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ) ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్టీపీసీ డీజీఎం(హెచ్ఆర్) బద్రుద్దీన్ అన్సారి మాట్లాడుతూ.. స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించామన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థితికి రావడంతో పాటు తమ కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలువాలన్నారు. మేనేజర్ (కార్పొరేట్ కమ్యూనికేషన్) ప్రియాంక భుయాన్ మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతలో భాగంగా ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించామన్నారు. విజేతలకు త్వరలో ఎన్టీపీసీ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరి


వాకర్స్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న ఆసుపత్రి వైద్య సిబ్బంది

అమీర్‌పేట: దైనందిన జీవన విధానంలో ఒత్తిళ్లను అధిగమించేందుకు ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి జనరల్ ఫిజిషియన్ డాక్టర్ మిసాద్ అన్నారు. అమీర్‌పేటలోని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీనగర్‌కాలనీలోని జీహెచ్ఎంసీ పార్క్‌లో వాకర్స్ కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలతో పాటు ఆక్సిజన్ లెవల్స్, బీఎంఐ ఇతర సాధారణ వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం వ్యాయామంతో పాటు క్రమశిక్షణతో కూడిన ఆరోగ్యకరమైన జీవన శైలిని పాటించడం కూడా ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది దుర్గ, సైదాబి, సునీత, అపర్ణలత, పెంచల్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవలందించిన వారికి జ్ఞాపికల బహూకరణ


జ్ఞాపికలతో సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: మాణికేశ్వర్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ భవనం ప్రారంభోత్సవం, ఈదమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఇటీవల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సేవలందించిన పలువురిని సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సొసైటీ కార్యాలయంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు గండికోట కుమార్ మాట్లాడుతూ.. కుల సభ్యుల అందరి సహాయ సహకారాలతో సొసైటీ భవనం ప్రారంభోత్సవం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకోడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో తమ సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు. సన్మానం పొందిన వారిలో గండికోట నర్సింహ, జి. రాము, నవీన్, సొసైటీ సభ్యులు తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు జి. శ్రీనివాస్, కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగింత



సికింద్రాబాద్: రైల్వేస్టేషన్‌లో తప్పిపోయిన నాలుగేళ్ల చిన్నారిని రక్షించిన రైల్వే పోలీసులు శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం తన భార్య నాలుగేళ్ల కూతురితో కలిసి పీఠాపురం నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. రైలు దిగే క్రమంలో తన కుమార్తె కనిపించకుండా పోయింది. ప్లాట్‌ఫామ్ అంతటా గాలించిన సుబ్రహ్మణ్యం పోలీసులను ఆశ్రయించాడు. వెంటనే స్పందించిన రైల్వే పోలీసులు ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ పందరి నేతృత్వంలో బృందాన్ని ఏర్పాటు చేసి బాలిక ఆచూకీ కోసం ఆపరేషన్ ప్రారంభించారు. బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

‘చెత్త’పై మార్పు మొదలైంది..

- ప్రజల్లో విస్తృత అవగాహన
- తీరు మారకుంటే ఎస్ఎల్ఎఫ్ జరిమానాలు
- క్రమేపీ చెత్త డంపింగ్ పాయింట్ల ఎత్తివేత



రోడ్లపై చెత్త వేయవద్దంటూ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డీసీ సమ్మయ్య

సనత్‌నగర్: స్లమ్ లెవల్ ఫెడరేషన్(ఎస్ఎల్ఎఫ్)లను భాగస్వామ్యం చేస్తూ స్వచ్ఛ బేగంపేటగా తీర్చిదిద్దేందుకు సర్కిల్ అధికారులు చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. చెత్త రహిత రహదారులతోపాటు చెత్త డంపింగ్ పాయింట్లు అనేవి లేకుండా చేయడంలో ఎస్ఎల్ఎఫ్‌లకు కీలక బాధ్యతలను అప్పగించారు. బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య నేతృత్వంలో శానిటేషన్ సిబ్బంది, ఆర్‌పీ (రిసోర్స్ పర్సన్స్), ఎస్ఎల్ఎఫ్‌లతో కలిసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసేవారిపై జరిమానాలు విధించే బాధ్యతలను ఎస్ఎల్ఎఫ్‌లకు అప్పగించారు. మురికివాడలను నూటికి నూరు శాతం స్వచ్ఛత పాటించేలా తీర్చిదిద్దే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు సర్కిల్ పరిధిలో 15 ప్రాంతాల్లో చేపట్టిన ఈ కార్యక్రమాల్లో నేరుగా డీసీ సమ్మయ్య హాజరై దిశానిర్దేశం చేసి అవగాహన కల్పిస్తూ వచ్చారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే మార్పు మొదలైంది. రోడ్లపై వేసేవారు కిమ్మనకుండా ఇళ్ల ముందుకువచ్చే చెత్త ఆటో ట్రాలీలకు అందిస్తూ వస్తున్నారు. పలుచోట్ల చెత్త డంపింగ్ పాయింట్లను ఎత్తివేశారు. తాజాగా శుక్రవారం బేగంపేట ఓల్డ్ కస్టమ్స్‌బస్తీలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఎస్ఎల్ఎఫ్‌ల బాధ్యత ఇదీ..

- శానిటేషన్ సిబ్బంది విధులకు సమాంతరంగా స్లమ్ లెవల్ ఫెడరేషన్‌లు భాగస్వామ్యమై రోడ్లపై, నాలాల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా విస్తృతంగా అవగాహన కల్పిస్తారు.
- పది రోజులపాటు అవగాహన కల్పించిన అనంతరం తీరు మారనివారిపై జరిమానాల రూపంలో కొరడా ఝుళిపిస్తారు.
- రూ.1000 వరకు జరిమానా విధిస్తారు.
- ఎన్నిసార్లు చెత్త వేస్తే అన్నిసార్లు జరిమానాలు విధిస్తూనే ఉంటారు.
- బస్తీకి చెత్తఆటో ట్రాలీ రాలేదంటే దాని డ్రైవర్‌కు కూడా జరిమానా విధిస్తారు.
- అలా జరిమానాల రూపంలో వచ్చిన నగదును జీహెచ్ఎంసీకి కాకుండా ఎస్ఎల్ఎఫ్ గ్రూపుల ఖాతాల్లో జమ చేసుకునే వెసులుబాటు ఇచ్చారు.
- ఒక ఎస్ఎల్ఎఫ్ గ్రూపులోని ఐదుగురు సభ్యులతో పాటు ఒక ఆర్‌పీ కలుపుకుని మొత్తం ఆరుగురు ఈ బాధ్యతలను కొనసాగిస్తారు.


అవగాహన కల్పిస్తున్న దృశ్యం..

డంపింగ్ పాయింట్లను ఎత్తేయడమే లక్ష్యం: డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య

పారిశుధ్య నిర్వహణపై ఇప్పటికే పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశాం. మొదటి స్థాయిలో శానిటేషన్ వర్కర్స్‌కు, రెండో స్థాయిలో చెత్తను తరలించే ఆటోట్రాలీ డ్రైవర్లతో, మూడో స్థాయిలో ఎస్ఎల్ఎఫ్ సంఘాలతో సమావేశాలు ఏర్పాటుచేసుకుంటూ వెళ్తున్నాం. ఈ చర్యలు ఎంతో సత్ఫలితాలను ఇస్తున్నాయి. సంఘంలో తీర్మానం చేసుకున్న విధంగా చెత్త వేసిన వారిపై జరిమానాలు విధిస్తుండటం మూలంగా క్షేత్రస్థాయిలో మార్పు మొదలైంది. జూన్ 2 నాటికి అన్ని ప్రాంతాల్లో చెత్త డంపింగ్ పాయింట్లను ఎత్తివేసి నూటికి నూరు శాతం చెత్త ఆటో ట్రాలీలకు అందించేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

ఎస్ఎల్ఎఫ్‌లు భాగస్వామ్యంతో మెరుగైన ఫలితాలు: ఆర్‌పీ ప్రశాంతి

స్లమ్ లెవల్ ఫెడరేషన్ సభ్యులు చేసుకునే తీర్మానంతో నూరు శాతం ఫలితాలను సాధించవచ్చు. వీరు బస్తీలోనే నివాసం ఉంటూ ఎవరెవరు చెత్తను బయట పడేస్తున్నారో గుర్తించేందుకు వీలు ఉంది. తద్వారా వారు తీర్మానంలో తీసుకున్న నిర్ణయం మేరకు జరిమానాలు విధిస్తారు. తద్వారా పూర్తిస్థాయిలో మార్పు వచ్చే అవకాశం ఉంది.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: హెచ్‌పీఎస్, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వరుణ్ మోటార్స్, సోనాటా, కట్టమైసమ్మ టెంపుల్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, సూర్యోదయ బిల్డింగ్,
- మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు మయూరిమార్గ్, అల్లంతోటబావి, గీతాంజలి స్కూల్,
- మ. 2 నుంచి 3.30 గంటల వరకు ప్రకాష్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుక ప్రాంతం, చీకోటి గార్డెన్,
- మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

ప్యారడైజ్ డివిజన్ పరిధిలో..

జేమ్స్‌స్ట్రీట్, సీతాఫల్‌మండీ, కిమ్స్, అడ్డగుట్ట సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం కరెంటు సరఫరా ఉండదని ప్యారడైజ్ ఏడీఈ ఆదినారాయణరావు తెలిపారు.

- ఉ.11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల స్వప్నలోక్ కాంప్లెక్స్ 1, 2, కిందిబస్తీ, అన్నానగర్, భవానీ నగర్, మసీద్ ఏరియా, నామాలగుండు టెంపుల్.
- మధ్యాహ్నం 1 నుంచి 2.30 గంటల వరకు ఆర్‌బీసీ సెంటర్, కృష్ణానగర్ కాలనీ, వెంకట్రావునగర్, కృష్ణానగర్, బాపుబాగ్, గ్రీన్‌గేట్, ప్రశాంత్ అపార్ట్‌మెంట్స్, హరి నివాస్ హనుమాన్ టెంపుల్, వడ్డెరబస్తీ, తుకారంగేటు, ఇందిరాగాంధీ విగ్రహం, గంగపుత్ర సంఘం, మీనా హాస్పటల్, సుభాష్ విగ్రహం, సాయిబాబా టెంపుల్, నేషనల్ సీడ్స్, లాలాగూడ రైల్వే స్టేషన్,
- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు పోస్టాఫీసు, సింధ్‌బ్యాంక్, హనుమాన్ చరణ్, కేడియాహౌస్, మూల్‌చంద్ ప్రియాంక, కెనరాబ్యాంక్, పీజీ రోడ్డు, జవహర్‌నగర్ గార్డెన్, ఇందిరానగర్, రామాలయం, సూపర్‌బజార్, బీదలబస్తీ, టీఆర్‌టీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

సుజాతకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ తెలుగు శాఖ నుంచి సుజాత అజ్మీరాకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. తెలుగు అధ్యాపకులు డాక్టర్ సిల్మానాయక్ పర్యవేక్షణలో మూడ కృష్ణానాయక్ జీవితం, సాహిత్యం అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. సుజాత అజ్మీర సిటీ కాలేజీలో తెలుగు అధ్యాపకురాలిగా పని చేస్తున్న ఆమెను పలువురు అధ్యాపకులు అభినందించారు.

కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.27, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 135, గింజ బీక్కుడు 70, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, రూట్ రూట్ 19, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 32, చామగడ్డ 45, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు లేదా జేఎన్‌టీయూకు మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని తెలంగాణ మాల స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చినేని వెంకట్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్రంలో 107 ఏళ్ల ఓయూ, 51 ఏళ్ల జేఎన్‌టీయూకు ఇంత వరకు ఒక్క ఎస్సీ ప్రొఫెసర్‌ను కూడా వీసీగా నియమించలేదన్నారు. ఇదిలా ఉండగా పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని వెంకట్ కోరారు.

నాలుగున్నర కిలోల కణితి తొలగించారు!


కణితిని చూపుతున్న వైద్యులు

బౌద్ధనగర్: ఓ మహిళ కడుపులో ఉన్న నాలుగున్నర కిలోల కణితిని బౌద్ధనగర్‌లోని బీవీకే ఆసుపత్రి వైద్యులు తొలగించారు. నగరానికి చెందిన ఓ మహిళ గత కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతూ బీవీకే రెడ్డి ఆసుపత్రిలోని వైద్యులను సంప్రదించారు. ఇక్కడ వైద్యులు వైద్య పరీక్షలు చేసి గర్భసంచిలో భారీ కణితిని గుర్తించారు. కణితిని తొలగించాలని వైద్యులు రోగికి చెప్పారు. గైనకాలజిస్టు అనురాధారెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్ కేశవరెడ్డి, డాక్టర్ రితికతో కలిసి శస్త్ర చికిత్స చేసి కణితిని తొలగించారు.

ఓయూలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిట్స్ పిలానీ కావాల, పల్లి బఠాని కావాలని సభలో మాట్లాడటం పట్ల ఓయూలో నిరసన తెలిపారు. కేటీఆర్ క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవతరాయ్, నాగరాజు, మణికంఠ, అశోక్, అరుణ్, హేమంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రూ.13.16 లక్షల విలువైన బంగారు ఆభరణాలు పట్టివేత


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను చూపిస్తున్న పోలీసు అధికారులు

సికింద్రాబాద్: ఎటువంటి ధృవీకరణ పత్రాలు లేకుండా రవాణా చేస్తున్న రూ.13.16 లక్షల విలువ చేసే 188.80 గ్రాముల బంగారు ఆభరణాలను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ డీఎస్‌పీ జావెద్, ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం...ఉదయం 6.30 గంటల ప్రాంతంలో రైల్వేస్టేషన్ 4వ ప్లాట్‌ఫామ్‌పై జీఆర్‌పీ కానిస్టేబుళ్లు మునేశ్వర్‌రావు, రమేశ్ నేతృత్వంలో ప్రయాణికుల లగేజీలు తనిఖీ చేశారు. చార్మినార్ ప్రాంతానికి చెందిన మనట్ హద్రైత్ అనే ప్రయాణికుడి వద్ద బంగారు ఆభరణాలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. సదరు ఆభరణాలకు సంబంధించి పోలీసులకు సరైన ఆధారాలు ఇవ్వలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం ఆదాయపుశాఖ అధికారులకు కేసు బదిలీ చేశారు. కాగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిపిన దాడుల్లో రూ.1.45 కోట్ల విలు చేసే బంగారు ఆభరణాలు, గంజాయి, నగదును స్వాధీనం చేసుకున్నట్టు జీఆర్‌పీ జావెద్, ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్ శుక్రవారం విలేకరులకు తెలిపారు.

నేషనల్ మాస్టర్స్ గేమ్స్‌లో ఏఎస్ఐ శ్యామల సత్తా



పతకాలు సాధించిన శ్యామల..

సనత్‌నగర్: పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ (ఆర్) ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 24 వరకు నగరంలో జరిగిన ఫస్ట్ ఫెడరేషన్ కప్ నేషనల్ మాస్టర్స్ గేమ్స్-2024లో బేగంపేటకు చెందిన సైఫాబాద్ ట్రాఫిక్ ఏఎస్ఐ శ్యామల సత్తా చాటారు. ఆమె షార్ట్‌పుట్ గేమ్‌లో ద్వితీయ స్థానాన్ని, డిస్కస్ త్రోలో రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని విజయాల సాధనకు కృషి చేస్తానన్నారు.

దాచుకున్న డబ్బు ఇస్తే.. బిచాణా ఎత్తివేశాడంటూ ఫిర్యాదు

బంజారాహిల్స్: అవసరాల కోసం వాడుకోవడానికి డబ్బులు దాచుకుంటుండగా సదరు సంస్థ ప్రజలను మోసం చేయడమే కాకుండా బిచాణా ఎత్తేసిందని, వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలివీ... యూసుఫ్‌గూడ సమీపంలోని వెంకటగిరిలో నివసించే బంగి రవికుమార్ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ తనకు వచ్చే డబ్బులను భద్రపరచుకుందామని ఇందిరానగర్ సెయింట్ మేరీ స్కూల్ సమీపంలో ఉన్న కనకలక్ష్మీ సేవింగ్స్‌లో జమ చేస్తూ వచ్చాడు. ప్రతినెలా జీ పే ద్వారా డబ్బు పంపించేవాడు. అయితే గత జనవరిలో కనకలక్ష్మీ సేవింగ్స్ ఆఫీసు మూసివేశారని స్నేహితుల ద్వారా తెలిసింది. వాస్తవం తెలుసుకునేందుకు రవికుమార్ సదరు కార్యాలయానికి వెళ్లి చూడగా అక్కడి నుంచి బిచాణా ఎత్తేసినట్లు తేలింది. దీంతో కనకలక్ష్మీ సేవింగ్స్ ఎండీ కొండా రవికి ఫోన్ చేయగా డబ్బులు ఇచ్చేది లేదు..ఏమి చేసుకుంటావో చేసుకో అంటూ బెదిరించాడు. తనతో పాటు ప్రజలను సేవింగ్స్ పేరుతో నిండా ముంచిన కొండా రవిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చీటింగ్ కేసుతో పాటు మనీసర్క్యులేషన్ స్కీమ్ యాక్ట్, ప్రైజ్ చిట్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మురుగుకు శాశ్వత పరిష్కారం చూపాలి





సనత్‌నగర్: ఎఫ్‌సీఐ ఎదురుగా జెక్‌కాలనీలోని కమర్షియల్ కాంప్లెక్స్ నుంచి తరచూ డ్రైనేజీ పొంగిపొర్లుతుండడంతో వాహనదారులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. గత కొన్ని నెలలుగా ఈ సమస్య తలెత్తుతుండటంతో అటుగా వెళ్లేవారు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి సిబ్బంది తాత్కాలికంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేయడం లేదని జెక్‌కాలనీ ఫెడరేషన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సనత్‌నగర్ ప్రధాన రహదారితో పాటు జెక్‌కాలనీ హెచ్‌డీఎఫ్‌సీ రోడ్డులో మురుగునీరు వరదలా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



